General News



# అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్య

- చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన జిల్లా కలెక్టర్
- మూడో శనివారం పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ ప్రైమరీ విద్యను అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శనివారం జిల్లాలోని బచ్చన్నపేట మండలం కొన్నె అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రీ ప్రైమరీ విద్యకు సంబంధించిన మెటీరియల్ ను పరిశీలించి, సంబంధిత టీచర్లను అభినందించారు. ఈ క్రమంలో బొమ్మరిల్లు, కార్నర్స్, ప్రొఫైల్ బ్యాగ్స్, జూ పార్క్ వంటి ప్రీ ప్రైమరీ విద్యా మెటీరియల్ ను తనిఖీ చేశారు. అలాగే పిల్లలు చెప్పే కథలను, అంగన్‌వాడీలో చిన్నారులకు నిర్వహించే తదితర కార్యక్రమాలను పర్యవేక్షించారు. అదే విధంగా చిన్నారుల తల్లులతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్యలక్ష్మి పథకం కింద అందించే పౌష్ఠికాహారం గురించి, కేంద్రాలకు వచ్చే భోజనం తింటున్నారా? లేదా? అని గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని టీజీ మోడల్ పాఠశాలను సందర్శించి, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల కింద ఉన్న తల్లిదండ్రులు పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల అకాడమిక్ కు సంబంధించిన మార్కులను, మధ్యాహ్న భోజన తయారీని పరిశీలించాలని సూచించారు. ప్రతి నెలలో మూడో శనివారం నిర్వహించే పేరెంట్, టీచర్ సమావేశంలో పాఠశాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే చర్చించాలని, వాటిపై చర్యలు తీసుకొని పరిష్కరించాలని వివరించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ జయంతి, డీఈఓ రాము, జీసీడీఓ గౌసియా బేగం, సీడీపీఓ రమాదేవి, తహసీల్దార్ విశాలాక్షి, సూపర్‌వైజర్ కవిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టాన్ని అమలుచేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జనగామ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు కట్టలేక పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఫీజులను నియంత్రించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి, కలెక్టర్ డీఎఫ్ఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కళాశాల నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఆర్య, శ్రీనాథ్, వైష్ణవి, స్పందన, హారిక, దీక్ష, రేఖ, వర్ష, సహస్ర, నిషిత పాల్గొన్నారు.






## మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

**చేర్యాల, మన చౌరాస్తా :** మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బండారి కనకయ్య చేర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా శనివారం చేర్యాల కురుమ సంఘం మండల అధ్యక్షుడు శేవల్ల రాజయ్యతో పాటు కురుమ సంఘం నాయకులు కనకయ్యను సత్కరించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ మార్కెట్ కమిటీ సభ్యులు సమన్వయంతో ముందుకు సాగాలని, రైతులను సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రైతులకు సేవలు చేస్తూ, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాంపూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ శెట్టె ఓజయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శేవల్ల కిష్టయ్య, బండారి సిద్దయ్య, బండారి శ్రీశైలం, శెట్టె పోషయ్య, శెట్టె కొమురయ్య, శెట్టె అనిల్ పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే కారు ఢీకొని మహిళ మృతి

- కారు వదిలి వెళ్లిన తాటికొండ రాజయ్య

**కాజీపేట , మన చౌరాస్తా :** స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య కారు ఢీకొని కలకోట్ల స్వప్న (40) అనే మహిళ మృతి చెందింది. ఈ ఘటన కాజీపేట మండలం మడికొండ వద్ద చోటుచేసుకుంది. మహిళా రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వచ్చిన రాజయ్య కారు ఢీకొట్టింది. ఆక్సిడెంట్ కాగానే కారు దిగి మహిళను చూసి రాజయ్య వెళ్లిపోయాడు. ఆ కారును కాజీపేట బాపూజీనగర్ లోనే మాజీ ఎమ్మెల్యే వదిలి వెళ్లిపోయాడు. మాజీ ఎమ్మెల్యేకు మానవత్వం లేదా అంటూ సోషల్ మీడియాలో ప్రజలు ట్రోల్ చేస్తున్నారు.



## విద్యార్థులకు అతిథి భోజనం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** తమ్మడపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న ఆకుల వెంకటలక్ష్మి తన జన్మదిన సందర్భంగా అతిథి బోజనం అందించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ తన జన్మదినోత్సవాన్ని ఇంట్లో కాకుండా చిన్నారుల మధ్య జరుపుకోవడం చాల ఆనందంగా ఉందన్నారు. తన కుమారులు వంశీ కృష్ణ, దీరజ్ కృష్ణ కోరిక మేరకు ఈ వేడుకలు జరుపుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ బచ్చన్నపేట మండల అధ్యక్షుడు మహ్మద్ అంకుషావలి, ఉపాధ్యాయులు ఫరీద బేగం, వెంకటనర్సింహారెడ్డి, గ్రామ కార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

